మధురవాడలో అంగన్‌వాడీ భవనాలు,మౌలిక సదుపాయాలకు నిధుల కేటాయింపు ఇలా

5వ వార్డు పరదేశిపాలెం	రూ.1,63,493
మారికవలస	రూ.87,314
బోరవానిపాలెం	రూ.87,815
సాయిరాం కాలనీ	రూ.79,050
నగరంపాలెం	రూ.1,25,177
వికలాంగుల కాలనీ	రూ.99,628
6వ వార్డు కొమ్మాది	రూ.1,61,179
భగవాన్‌దాస్ కాలనీ	రూ.31,050
బక్కన్నపాలెలం	రూ.31,050
శంభువానిపాలెం	రూ.79,050
రేవళ్లపాలెం	రూ.79,050
ఆర్. హెచ్. కాలనీ	రూ.31,050
పోతిన మల్లయ్యపాలెం	రూ.1,38,865
7వ వార్డు మల్లయ్యపాలెం	రూ.1,35,678
శ్రామిక నగర్	రూ.79,050
సంతోష్‌నగర్	రూ.79,050
సంతోష్‌నగర్-2	రూ.31,050
స్వతంత్రనగర్	రూ.79,050
శ్యాంనగర్	రూ.79,050
వాంబేకాలనీ	రూ.31,050
శ్యాంనగర్ కాలనీ-2	రూ.79,050
స్వతంత్రనగర్-2	రూ.79,050
చంద్రంపాలెం	రూ.1,60,678
8వ వార్డు గుడ్ల వానిపాలెం	రూ.31,050
ఎండాడ	రూ.31,050
మునలయ్యపాలెం	రూ.1,43,493
పాత మధురవాడ	రూ.1,60,678

అంగన్‌వాడీ.. నూతన ఒరవడి

సంతపేట అంగన్‌వాడీ మెర్జింగ్ సెంటర్‌లో చిన్నారులఆటపాటలు





నాడు

వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లేక చిన్నారులు బలహీనమవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లల్లో చాలామంది పౌష్టికాహార లోపంతో బాధపడ్డారు. అంగన్‌వాడీల్లోని అయిదేళ్లలోపు చిన్నారుల ఎదుగుదలపై గత ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యమే కనిపించింది. లోపాన్ని అధిగమించేందుకు పిల్లలందరికీ రోజూ గుడ్డు, పాలు అందించాలని ప్రతిపాదించినా అవి సక్రమంగా పిల్లలకు అందేవి కావు..నియంత్రణ లేకపోవడంతో పక్కదారి పట్టేవి.

నేడు

పిల్లల జీవితంలోని క్లిష్టమైన మొదటి ఐదేళ్లలో సమర్థవంతమైన అభిజ్ఞా, భావోద్వేగ, సామాజిక అభివృద్ధికి సురక్షితమైన, స్వచ్ఛమైన అనుకూలమైన వాతావరణాన్ని అందించాల్సిన అవసరాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చేసింది. మన అంగన్‌వాడీ నాడు-నేడు కార్యక్రమం కనీస సౌకర్యాలతో పాటు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు చేపట్టింది. మెరుగైన విద్యనూ అందిస్తోంది. పిల్లలకు ఇచ్చే మెనూలో సమూలు మార్పులు చేసింది.

- అందంగా రూపుదిద్దుకుంటున్న అంగన్‌వాడీలు
- కేంద్రాల్లో సకల సౌకర్యాలకు నిధులు
- పిల్లల వికాస కేంద్రాలుగా రూపాంతరం
- పాత భవనాలకు మరమ్మతులు, కొత్త భవనాలు నిర్మాణం



ఆనందపురం/మధురవాడ : మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ భవనాలు అందంగా రూపుదిద్దుకుంటున్నాయి. టీడీపీ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన అంగన్‌వాడీ కేంద్రాలు ఉనికినే కోల్పోయాయి. చిన్నారులకు మానసిక పరిపక్వత కల్పించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కరువవడంతో తల్లి దండ్రులు కేంద్రాలకు పంపడానికే వెనకడుగు వేసేవారు. చిన్న వయస్సులో పిల్లలకు పౌష్టికాహారం అందించి వారి ఆలనా పాలనా చూడవలసిన కేంద్రాలు అనాథలగా మిగిలిపోయాయి. కొన్ని భవనాలు శిథిలం కాగా, మరి కొన్ని అసౌకర్యాల నడుమ అద్దె భవనాల్లో కాలం వెళ్లదీస్తున్నాయి. సరైన నిఘా లేక పిల్లలకు అందాల్సిన పౌష్టికాహారం పక్కతోవ పట్టిన ఆరోపణలూ ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక జ్ఞాన సముపార్జనకు తొలి మెట్టుగా భావించే అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంస్కరణలు చేపట్టారు. ఈ మేరకు వ్యవస్థను ప్రక్షాళన చేశారు. నాడు-నేడు కింద కొత్త భవనాలు నిర్మాణం, పాత భవనాలకు పూర్తి స్థాయిలో మరమ్మతులు, తాగునీరు. విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం, ఆన్‌లైన్‌లో హాజరు వంటి సంస్కరణలు ప్రవేశ పెట్టడంతో ఒకప్పుడు దుంపలు బడులుగా పేరుబడ్డ అంగన్‌వాడీ కేంద్రాలు నేడు పిల్లల వికాస కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. అంగన్‌వాడీ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పిల్లలు ఉంతో ఉత్సాహంగా క్రమం తప్పకుండా వెళుతున్నారు.

సమూల మార్పులు

తగరపువలస: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేసింది. అందులో భాగంగా పీపీ-1 పేరుతో 3 ప్లస్, పీపీ-2 పేరుతో 4 ప్లస్ విద్యార్థులకు ప్రతిరోజు ఆటలు, పాటలు, ఇంగ్లిషు బోధన తదితర శిక్షణ ఇస్తున్నారు. వీరికి ఉదయం 10 గంటలకు కోడిగుడ్డు, తరువాత పాలు ఇస్తున్నారు. మధ్యాహ్న భోజన మెనూలో భాగంగా హాట్ పొంగల్, వెజ్ పలావ్, పులిహోర, వెజిటబుల్ రైస్, సాంబార్‌బాత్, లెమన్‌రైస్, అన్నం, ఆకుకూర రైస్, స్వీట్ పొంగల్, గ్రేవీ కర్రీ, దొండకాయ చట్నీ, ఆలూ కూర్మా, ఆకుకూర పప్పు, టమోటా చెట్నీ, పప్పు చారు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం

భీమిలి మండలంలో : **20** భవనాలు
మొత్తం నిర్మాణ విలువ : రూ.**2** కోట్లు
పద్మనాభం మండలంలో : **13** భవనాలు
మొత్తం నిర్మాణ విలువ : రూ.**1.30** కోట్లు
ఆనందపురం మండలంలో : **5** భవనాలు
నిర్మాణ వ్యయం : రూ.**67,50,000**
మండలంలో **31** అంగన్‌వాడీ భవనాల మరమ్మతులతో పాటు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.**21,00,000** మంజూరు

- 0.7 నెలల నుంచి 3 ఏళ్ల చిన్నారులకు నెలకు 25 కోడిగుడ్లు, రెండున్నర లీటర్ల పాటు ఇస్తున్నారు.
- గర్భిణులు, బాలింతలకు నెలలో వైఎస్సార్ కిట్ పేరుతో చోడిపిండి రెండున్నర కిలోలు, అటుకులు కిలో, పప్పు చెక్కి 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు, బెల్లం 250 గ్రాములు, బియ్యం 3 కిలోలు, నూనె అరకిలో, కందిపప్పు కిలో, 25 కోడిగుడ్లు, 25 ప్యాకెట్లు పాలు అందిస్తున్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలు



బంగ్లామెట్ట కేంద్రంలో గర్భిణులకు అవగాహన (ఫైల్)



ఆనందపురంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం

గత ప్రభుత్వం పట్టించుకోలేదు..



టీడీపీ ప్రభుత్వ హయాంలో గర్భిణులు, బాలింతలు కేంద్రానికి వచ్చి భోజనం చేయాలనే నిబంధన ఉండేది. ఇది వారికి కష్టంగా ఉండేది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వైఎస్సార్ కిట్లలో భాగంగా పౌష్టికాహారం అందిస్తున్నారు. చిన్నారులకు కూడా బలవర్ధక మైన ఆహారం అందిస్తున్నారు. –ఇంటి శాంతికుమారి, బంగ్లామెట్ట

క్లుప్తంగా

కుంతీమాధవస్వామి ఆలయంలో పూజలు

పద్మనాభం: కార్తీక పౌర్ణమి సందర్భంగా పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయాన్న భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో ఉన్న కుంతీ మాధవ స్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి, రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా కుంతీ మాధవ స్వామితో పాటు మిగతా విగ్రహాలు భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శన మిచ్చారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

భీమునిపట్నం: త్వరలో జరగబోయే ఎన్నికలకు నియోజకవర్గ స్థాయిలో అందరు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఇక్కడ పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు అధ్యక్షత జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాల్లో డివిజన్‌లకు అధ్యక్షులను నియమించామన్నారు. వీరందరు ప్రత్యేక దృష్టితో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. నాయకులు చింతాడ మోహనరావు, బండారు అనిల్‌కుమార్, ఉప్పాడ అప్పారావు పాల్గొన్నారు.

కృతజ్ఞతార్పణల పండుగ

తగరపువలస: 162 సంవత్సరాల పురాతన చిట్టివలస లండన్ మిషన్ చర్చ్ కృతజ్ఞతార్పణల పండగ ఆదివారం నూతనంగా నిర్మించిన మరడపాలెం దేవాలయంలో జరిగింది. రెవరెండ్ బి.ఎల్.కాంతయ్య అధ్యక్షతన జరిగిన ఆరాధనలో పలువురు సభ్యులు పాల్గొన్నారు. స్త్రీల మైత్రి, యూత్ గేమ్స్, స్టాల్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సదానంద మోజెష్, కోశాధికారి సుంకరి రాజేష్‌కుమార్, విశాఖ సంఘం నుంచి రెవరెండ్ విన్సెంట్, కార్యదర్శి రాజామణి, కోశాధికారి ట్రూమన్, కె.విలియం కేరీ, జాన్ చార్లీ, జాషువా పాల్, విజయ్, దిలీప్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాండ్రంగిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు తెలిపారు. ఏనుగులపాలెంలో ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్వాలా తోరణం



మహా కామేశ్వర స్వామి ఆలయంలో జ్వాలా తోరణం

మధురవాడ: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం పలు శైవాలయాల్లో నిర్వాహకులు స్వామి వారి తిరువీధి ఊరేగింపు, జ్వాలా తోరణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో బాగంగా మధురవాడ సిద్దేశ్వర పీఠం, మిథిలాపురి వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

ఉల్లాసంగా స్కేటింగ్



స్కేటింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురంలోని విజ్ఞాన్ వరల్డ్ వన్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన స్పీడ్ స్కేటింగ్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్ 2023-24 ఉల్లాసంగా ఉత్సాహంగా సాగింది. ఈ స్కేటింగ్‌లో వందలాది మంది విద్యార్థులు పాల్గొనగా పాఠశాల ప్రిన్సిపల్ చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభించారు.

భారతావని ముద్దుబిడ్డ అంబేడ్కర్



సంతపేటలో అంబేడ్కరు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: అంబేడ్కరు చూపిన బాటలో అందరూ నడవాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. భారత రాజ్యాంగ రచనా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు సంతపేటలో ఆదివారం ఆయన అంబేడ్కరు విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం దళితనాయకులు, విద్యావంతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎస్సీలకు సముచితమైన స్థానం కల్పించారన్నారు. మాజీ కౌన్సిలర్ జీవీ రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాలమహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ తరపున గంటాన మోహనరావు, రేక అప్పారావు, జీవీ అప్పారావు, దత్తి రవి, దత్తి శ్రీనివాసరావు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో దాట్ల పెదబాబు, బోని బంగారునాయుడు, చిల్ల భాస్కరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, చిప్పాడ వెంకటేష్, చిల్ల గణేష్‌రెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, శిల్లా వంశీరెడ్డి, సిమ్మల ప్రసన్న, కంచుబోయిన వెంకటరావు, సరగడ నాగిరెడ్డి, ఉప్పాడ నానిరెడ్డి, ఉప్పాడ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలి

భీమునిపట్నం: దేశపౌరులంతా భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ అన్నారు. ఆదివారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అధ్యాపకులు సోమయాజులు, మహాలక్ష్మి, త్రినాథరావు, మాధవి పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

సమానత్వానికి రాజ్యాంగం పెద్దపీట

మధురవాడ: సమానత్వానికి, హక్కుల పరిరక్షణకు భారత రాజ్యాంగం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు.భారత రాజ్యాంత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మధురవాడ జోనల్ కార్యాలయం ఆవరణలో మధురవాడ జై భీమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, 7వ వార్డు జేసీఎస్ ఇన్‌చార్జ్, మధురవాడ మాజీ సర్పంచ్ కుడితి రామారావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సియాద్రి కనకరాజు, 6వ వార్డు గౌరవాధ్యక్షుడు డాక్టర్ గాదే రోశిరెడ్డి, వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, పిళ్లా సూరిబాబు, వంకర అప్పారావు, పీకేఎం పాత్రుడు, జహనార పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

తగరపువలస: రాజ్యాంగ రచనా దినోత్సవం సందర్భంగా ఆదివారం పలుచోట్ల అంబేడ్కరు విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజ్యాంగంతో ఒనగూరే ప్రయోజనాలను కృష్ణంరాజుపేట యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడారు.

కార్తీక దీప విశిష్టతపై ప్రచారం

తగరపువలస: కార్తీక పౌర్ణమి సందర్భంగా త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక విజయరాంపురం, ఆనందాశ్రమం కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. భీమిలి మండలం లక్ష్మీపురం, జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేటలో జరిగిన కార్యక్రమంలో ప్రబోధానందుడు రచించిన త్రైతసిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల గురించి ప్రచారం నిర్వహించారు. అలాగే కార్తీకదీప విశిష్టత గురించి వివరించారు. ఆనందాశ్రమం కమిటీ అధ్యక్షుడు వి.చిరంజీవి వర్మ, గౌతంవర్మ, సుంకర శ్రీను, ఎం.గురప్ప, కె.సన్యాసి, వి.రోజామణి, ఎస్.దేవి, కె.కనకం, కె.వెంకటలక్ష్మి, కె.సూర్యం, విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలకు పోటెత్తిన సందర్శకులు

కొమ్మాది: కార్తీక మాసం నేపథ్యంలో సాగర్ నగర్ బీచ్, రుషికొండ బీచ్, డా.డి. రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, బావికొండ, తొట్లకొండ, మంగమారిపేట బీచ్, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్‌ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకులు సందడి చేశారు.

ఘనంగా క్రీస్తురాజు మహోత్సవాలు

తగరపువలస: చిట్టివలస క్రీస్తురాజు దేవాలయం 32వ వార్షికోత్సవం సందర్భంగా రెవరెండ్ అల్ఫోన్సా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం క్రీస్తురాజు మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తగరపువలస, భీమిలి, ఆనందపురం, పోలిపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. బాణసంచా, విద్యార్థినుల బ్యాండు మేళంతో క్రీస్తురాజు విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో పురవీధులలో ఊరేగించారు. ఈ సందర్భంగా స్తుతి స్తోత్రములతో భీమిలి సెయింటాన్స్ మఠ కన్యలు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చి ప్రతినిధులు ఐ.రాజుబాబు, పి.ప్రభాకర్, ఎం.జోసఫ్, ఎం.సత్యారావు, జీవన్, ఐ.రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పీఎం పాలెం బాలుర ప్రతిభ

పీఎంపాలెం: ఇటీవల నగరంలో జరిగిన అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో పీఎం పాలెంకు చెందిన వింగ్స్ చోటా ఖాన్ కరాటే విద్యార్థులు అద్భుత ప్రతిభ కనరచి వివిధ కేటగిరీల్లో పతకాలు సాధించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీల్లో పోతిన అక్షయ్ ప్రణీత్ కుమార్ 11 ఏళ్ల విభాగంలో బంగారు పతకం, కుమటి విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. తొమ్మిదేళ్ల విభాగంలో పోతిన తీరజ్ శ్రావణ్ సిల్వర్ మెడల్ అందుకోగా టీ. సాత్విక్ ఐదేళ్ల విభాగంలో బంగారు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం క్రీడాకారులను పీఎంపాలెంలోని విక్టరీ షాటో కాన్ కరాటే విశాఖ జిల్లా చైర్మన్ పోతిన ప్రసాద్ అభినందించారు.

వైభవంగా పోలమాంబ ఉత్సవాలు



తీరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

భీమునిపట్నం: భీమిలిలోని మత్స్యకారుల ఆరాధ్యదైవం శ్రీపోలమాంబ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. తొలేళ్ల సందర్భంగా మత్స్యకార మహిళలు కలశాల పండుగ నిర్వహించారు, పవిత్ర జలాలతో ఊరేగింపు నిర్వహించి సముద్ర తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, గ్రామాభివృద్ధి సేవా సంఘం గౌవర అధ్యక్షుడు మైలిపల్లి షణ్ముఖరావు, అధ్యక్షులు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్తీక దామోదర ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో కార్తీక దామోదర మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మంగళ హారతితో ప్రారంభమై గోపిగీత, భగవద్గీత 12వ అధ్యాయనం, శిష్టాష్టకం పారాయణం నిర్వహించారు.

భక్తితో రాధాకృష్ణుల మహోత్సవం



పూజల్లో పాల్గొన్న ముత్తంశెట్టి

భీమునిపట్నం: భీమిలిలో ఆదివారం నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాధాకృష్ణుల మహోత్సవం, పాలు పెరుగు యదుమేళా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఉత్సవ కమిటీ సభ్యులు అక్కరమాని వెంకటరావు, పిన్నింటి రమణ, కోంద్రు రామసూర్పడు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.